క్లుప్తంగా

మనోవికాస కేంద్రంలో వితరణ



అల్పాహారం ఏర్పాటు చేసిన దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనోవికాస్ కేంద్రంలో మిమిక్రీ శ్రీనివాస్ దంపతులు దివ్యాంగులకు అల్పాహారం, స్వీట్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అమెరికాలో ఉన్న గరిమెళ్ల విజయకుమార్ తన కుమార్తెలు హరిష, హవిషల జన్మదినం పురస్కరించుకొని ఈ వితరణ చేశారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

గార : బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాల కోసం లబ్ధిదారుల ఎంపికకు బుధవారం ఇంటర్వ్యూలు గార ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో 702 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరంతా దరఖాస్తు ఫారంతో పాటు విద్యార్హత సర్టిఫికెట్, రైస్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మండల పరిషత్ కార్యాలయం వద్దకు ఉదయం 10 గంటలకు చేరుకోవాలన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన డీఎం అమరసింహుడు

శ్రీకాకుళం అర్బన్ : వేసవి నేపథ్యంలో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ అన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో క్యాంటీన్ యజమాని నంద సౌజన్యంతో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలను దృష్టిలో ఉంచుకుని చల్లని పానీయాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీరు, మజ్జిగ వంటివి వెంట తీసుకుని ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎం ఎం.పి.రావు, పీఆర్వో కె.సుమన్, ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నిష్పక్షపాత విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న బిషప్ వి.జాషువా

గార: డాక్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిష్పక్షపాత విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల పాస్టర్స్ సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం గారలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి నిజాయితీ అధికారులతో దర్యాప్తు చేయించాలన్నారు. ప్రవీణ్ పగడాల కుటుంబానికి అన్ని విధాలా న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బిషప్ వి.జాషువా, మండల ఫెలోషిప్ సెక్రటరీ ఎల్.గాబ్రియేలు, కె.జాన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

దయా హృదయుడు రాముడు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: దయాగుణం కలవాడు రాముడని డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం 'యత్రభ్రాత్రా సహోదరః' అనే అంశంపై ప్రసంగించారు. రామాయణ ధర్మం శాశ్వతం అని, భూమిపై నదులు, పర్వతాలు ఉన్నంత వరకు రామాయణం ఉంటుందని చెప్పారు. అనంతరం వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో గుమ్మా నగేష్, డాక్టర్ నారాయణమూర్తి, కోమలరావు, నిష్టల నర్సింహమూర్తి, అంధవరపు సూరిబాబు, బాబూరావు, కామేశ్వరరావు, సీతమ్మ, పతంజలి శాస్త్రి, లక్ష్మీ, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల గ్రామంలో కూటమి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సోమవారం పర్యటించారు. మన ఊరికి మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులు జరగడం లేదని, రాంనగర్, ఎస్సీ కాలనీల్లో ఇంటింటి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, కొల్లిపల్లి కోనేరును మోడల్ కోనేరుగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో నాయకులు మెండ రాజారావు, మూకళ్ల భాస్కరరావు, నేతింటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అంతిమ దశలో.. వదిలేశారు!

- రూ.1.47 కోట్లతో గ్యాస్ క్రిమిటోరియం పూర్తిచేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఎన్నికల కోడ్ రావడంతో చివరి దశలో నిలిచిపోయిన ప్రక్రియ
- మెషీన్ కొనుగోలు చేయలేకపోతున్న కూటమి ప్రభుత్వం
- దహన సంస్కారాల సమయంలో నగరవాసులకు తప్పని పాట్లు



గ్యాస్ క్రిమిటోరియం భవనం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మనిషి మరణించాక దహన సంస్కారాలు పూర్తి చేసేందుకు సైతం ఇబ్బందులు పడే పరిస్థితి జిల్లా కేంద్రంలో నెలకొంది. ఎవరైనా మృతి చెందాక భౌతికకాయాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లేందుకు ప్రయివేటు వాహనం, కాల్చేందుకు కర్రలు, పెట్రోల్, డీజిల్ ఇతరత్రా ఖర్చులతో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. కాస్తంత స్తోమత ఉండేవారికి ఇవేమి పెద్ద లెక్కకాదు. నిరుపేదలకు మాత్రం అది భారంగానే ఉంటోంది.

కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వందలాది మృతదేహాలను కొత్తవంతెన వద్ద నాగావళి నదీ తీరంలో కాలుస్తుంటే తీవ్ర దుర్వాసన వెదజల్లేది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించేవారంతా ముక్కులు మూసుకుని వెళ్లే పరిస్థితి ఉండేది. అంతే కాకుండా కాలుస్తున్న మంటలను చూసి చిన్న పిల్లలు, మహిళలు తీవ్ర భయాందోళనకు గురయ్యేవారు.ఈ విషయం అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ధర్మాన ప్రసాదరావు దృష్టికి వెళ్లడంతో ప్రత్యామ్నాయ పరిష్కారం చేయాలని ఆలోచన చేశారు. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విషయం తెలియజేయగా రూ.1.47కోట్లు నిధులు మంజూరుచేశారు. దుర్వాసన చెక్ పెట్టాలంటే గ్యాస్ క్రిమిటోరియం ఒక్కటే మార్గమని నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేశారు. మృతి చెందినవారి బంధువులకు కాస్త ఉపశమనం చేకూర్చేందుకు చుట్టూ చక్కటి మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటుచేశారు. గ్యాస్ క్రిమిటోరియానికి భవన నిర్మాణం పూర్తిచేయడంతో పాటు గార్డెన్ సిద్ధం చేశారు. ఇంతలో సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో మిషనరీ కొనుగోలు ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్యాస్ క్రిమిటోరియాన్ని పట్టించుకోకుండా వదిలేసింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో దాదాపుగా పూర్తిచేసి చివరి దశలో ఉన్న పనులు పూర్తిచేయకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో అడి గార్డెన్ ఎండిపోయి పిచ్చిమొక్కలు పెరిగిపోయి చూడడానికి అధ్వానంగా మారింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి గ్యాస్ క్రిమిటోరియాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం..



ఇప్పటికే మిషనరీ తెచ్చేశాం. సీఎస్ఆర్ నిధులతో మరింత మెరుగైన టెక్నాలజీ మెషనరీ తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు ఆలోచన చేస్తున్నాం. మరింత మెరుగ్గా తయారుచేసి వాడుకలోకి తీసుకొస్తాం.

– పి.వి.వి.డి ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీకారం



ఎచ్చెర్ల:మురపాకలో పసుపు దంచుతున్న మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: పూజా కార్యక్రమంలో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నాగావళి తీరాన ఉన్న బలగ బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గణేష్ గురూజీ ఆధ్వర్యంలో సోమవారం సీతారాముల విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక రామ మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా సోమవారం పసుపుదంచు కార్యక్రమం నిర్వహించారు. మహిళలు సీతారాముల వారి దేవాలయానికి చేరి పసుపు దంచారు. భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

భజన పోటీల విజేత దేవరవలస



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

జి.సిగడాం: ఉగాది పండగ సందర్భంగా జి.సిగడాంలో నిర్వహించిన మండల స్థాయి భజన పోటీల్లో దేవరవలసకు చెందిన ఉమా చంద్రశేఖర భజన బృందం విజేతగా నిలిచింది. శ్రీరామా భజన బృందం(అద్వాన్నంపేట), రాజేశ్వరి భజన బృందం(బాతువ) ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. ఉత్తమ హార్మోనియంగా ఎస్.వెంకటరమణ (నిద్దాం), ఉత్తమ గాయకుడిగా సీహెచ్ లక్ష్మణరావు (దేవరవలస), ఉత్తమ డోలక్‌గా పి.త్రినాథరావు(బాతువ), కన్సొలేషన్ బహుమతులకు సీతారామ భజన బృందం(పెంట), శ్రీరామా భజన బృందం (ఆనందపురం)లను ఎంపిక చేశారు. నంది అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు హొంజరావు సత్యం, అప్పన్నదొర, బొడ్డేపల్లి జనార్దనరావులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల కళాకారుల సంఘం నాయకులు డీఎం రామం, ముళ్లపూడి రామచంద్రరావు, పిన్నింటి నారాయణరావు, కోనా శంకర్, సిరిగుడు కుమార్, సిరిగుడు గోపాలం తదితరులు పాల్గొన్నారు.

తిలక్ హాలు నిర్మాణం పూర్తి చేస్తాం



పనుల వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఏడురోడ్ల కూడలి వద్ద ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న తిలక్ హాలు నిర్మాణం రూ.30 లక్షలతో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆహ్వానం మేరకు సోమవారం నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీర్లతో అంచనాలు వేయించామని, దివంగత వీజేకే మూర్తి కోరిక మేరకు భవనాన్ని పూర్తి చేసే బాధ్యత తనదని చెప్పారు. అవసరమైతే స్కూల్‌ను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. విద్యార్థులు భోజనాలు చేసేందుకు నిర్మించిన షెడ్డు రేకులు గాలి వానకు విరిగిపోయాయని, వాటిని కూడా బాగు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, హెచ్ఎం దేవదత్తానంద్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జి.ఎస్.ఎస్.ప్రకాష్, ప్రధాన కార్యదర్శి జామి భీమశంకర్, ట్రెజరర్ కిల్లాన ఫల్గుణరావు, పాలిశెట్టి మల్లిబాబు, మండ ప్రభాకరరావు, మండ శ్రీనివాసరావు, ఢిల్లీ భాస్కరరావు, పేర్ల కామరాజు, పేర్ల ప్రభాకరరావు, మాజీ కౌన్సిలర్ కెల్ల కొండలరావు, పాండ్రంకి శంకర్, టీచర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రణస్థలం జామియా మసీదులో రంజాన్ ప్రార్థనలు

శ్రీకాకుళం కల్చరల్/రణస్థలం: నగరంలోని చారిత్రక, అతిపెద్ద పురాతన జామియా మసీదులో రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదు ముఫ్తీ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' చెప్పుకున్నారు. ఈ సందర్భంగా ముఫ్తీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రజలు శాంతి సౌభాగ్యాలతో సమైక్యంగా మెలగాలని కోరారు. ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు ధానధర్మాలు నిర్వహించారు. చంపామసీదు, నూరానీ మసీదు, చందా మసీదు, మచ్చన్‌బీ మసీదు, మదీనా మసీదు, మీనా మసీదుల ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా, పట్టణంలోని టౌన్‌హాలు వద్ద ఈదుల్ ఫితర్ నమాజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కళింగ రోడ్డులోని అహెల్ అతీల్ ఫిరదౌసీ మసీదుకు చెందిన ముస్లింలు సామూహికంగా ప్రార్థనలు చేశారు. రణస్థలంలోని జామియా మసీదులో రంజాన్ వేడుకల ఘనంగా నిర్వహించారు. ముస్లిం మతపెద్ద షేక్ సలీమ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాంతితత్వం, ఐకమత్యంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జామియా మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రోడ్డుపైనే చెత్త పోగులు



తమ్మినాయుడుపేట సమీపంలో చెత్త పోగు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిలో కొన్నిచోట్ల డివైడర్లను ఆనుకుని చెత్త పేరుకుపోతోంది. నిర్వహణలో భాగంగా ఎప్పటికప్పుడు రోడ్డు శుభ్రం చేస్తున్నా చెత్తను పక్కనే పోగులుగా వేస్తున్నారు. దీనిని సకాలంలో తొలగించడం లేదు. రోజుల తరబడి వదిలేస్తుండటంతో గాలి ధాటికి మళ్లీ రోడ్డుపైకే వచ్చేస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యపై దృష్టి సారించాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

ఉత్తరేశ్వరుడికి అభిషేకాలు



బలగలోని ఉమా సహిత ఉత్తరేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు తరలిరావడంతో అర్చకులు స్వామి వారికి విశేష పూజలు, అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

పిల్లర్ల దశకే పరిమితం



ఎచ్చెర్లలో రైతు భరోసా కేంద్రం పిల్లర్ల దశలోనే ఆగిపోయింది. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ రూ.20 లక్షలు అంచనా వ్యయంతో పనులు చేపట్టినా ప్రారంభ దశలోనే ఆగిపోయింది. నిధులు మంజూరు చేసి భవనం పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

అస్తవ్యస్తంగా పలకలు



శ్రీకాకుళం నగరంలో చిన్నమండల వీధిలో రవీంద్రభారతీ స్కూల్ సమీపంలో కాలువపై పలకలు ఎత్తుపల్లాలుగా ఉన్నాయి. దీనికి తోడు ఈ ప్రాంతంలో గేదెలు సంచారం కూడా అధికంగా ఉండడంతో అటువైపుగా రాకపోకలు సాగించేవారంతా ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పలకలు సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

- శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

సైకిళ్ల వితరణ



శ్రీకాకుళం నగరానికి చెందిన ఎన్నారైల సౌజన్యంతో ముగ్గురు విద్యార్థినులకు డీఎస్పీ సిహెచ్ వివేకానంద సోమవారం సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు, ఎన్నారైల తరఫున శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం క్రైమ్

అగ్రిల్యాబ్ ప్రారంభమెప్పుడో..?

- గత ప్రభుత్వ హయాంలో రూ.3.68 కోట్లతో భవన నిర్మాణం
- పరికరాలు, సిబ్బంది నియామకంపై దృష్టిపెట్టని కూటమి ప్రభుత్వం



అంపోలు పరిధిలో నిర్మాణం పూర్తయిన జిల్లా స్థాయి అగ్రిల్యాబ్



మెట్లు వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

గార: జిల్లాలోని రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందాలన్న సదుద్దేశంతో, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అగ్రిల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక ల్యాబ్‌తో పాటు జిల్లా స్థాయిలో ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో గార మండలం అంపోలు పరిధిలో జిల్లా స్థాయి అగ్రిల్యాబ్ నిర్మాణం చేపట్టింది. ప్రభుత్వ నిర్మాణశాఖైన ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. ఇందుకోసం రూ. 3.68 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాలని సిద్ధమయ్యే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవం నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరికరాలు, సిబ్బంది నియామకం చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. జిల్లాలోనే కేంద్ర మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి ఉన్నా జిల్లా ల్యాబ్ పై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాణ్యమైన సేవలు అందేనా...

ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాల్లో సరఫరా చేసే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల శాంపిల్స్‌ను వ్యవసాయశాఖతో పాటు విజిలెన్సు అధికారులు సేకరిస్తుంటారు. వీటితో పాటు రైతు తీసుకొచ్చిన శాంపిల్స్‌ను జిల్లా అగ్రిల్యాబ్‌లో తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు అధికారులు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలోని ల్యాబ్‌లకు పంపిస్తుండగా, రైతులు అంతదూరం శాంపిల్ తీసుకెళ్లినా ఫలితాలు ఆలస్యంగా రావడం, ప్రయాణ ఖర్చులు, సమయం వంటివి సాగుకు ఇబ్బందిగా పరిణమించాయి. జిల్లా అగ్రిల్యాబ్‌లో తనిఖీలో నకిలీవి అని తేలితే ఫెర్టిలైజేషన్ కంట్రోల్ ఆర్డర్ (ఎఫ్‌సీఓ) ప్రకారం కేసు నమోదు చేస్తారు. ముందుగా ఆయా విత్తనాలను కిందిస్థాయిలోనే అమ్మకాలు నిలిపేలా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల నాణ్యమైన విత్తనాలను పంట విత్తే సమయంలో రైతులు వేయవచ్చు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వాడిన తర్వాత తెలిసినా, అన్నదాతలకు సమయంతో పాటు డబ్బులు నష్టపోతారు. దీన్ని అధిగమించేందుకు జిల్లాలోనే నాణ్యమైన సేవలందేలా గత ప్రభుత్వం వీటికి రూపకల్పన చేసింది. అన్నదాతకు ప్రాముఖ్యత కలిగిన సేవలపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. ల్యాబ్‌కు డీడీ స్థాయి అధికారి, ముగ్గురు ఏడీ, ముగ్గురు ఏవోలు, పరీక్షలు జరిపే సిబ్బందిని నియామకం చేపట్టాల్సి ఉంది. పరికరాలు కొనుగోలుపైనా దృష్టిసారించాల్సి ఉంది.

మంత్రి దృష్టి సారించాలి



జిల్లా అగ్రిల్యాబ్‌ను అధికారులు త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వ హయాంలో రైతులకు నాణ్యమైన సేవలందించే ఉద్దేశంతో ఈ నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంతవరకు ల్యాబ్ ప్రారంభంపై ఆలోచన చేసినట్లు లేదు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రితో పాటు కేంద్ర మంత్రి ల్యాబ్ ప్రారంభంపై దృష్టి సారించాలి.

– గొండు రఘురామ్, ఎంపీపీ, వైఎస్సార్ సీపీ జోనల్ వ్యవసాయ విభాగం అధ్యక్షుడు, గార

రైతులకు మేలు..



జిల్లాస్థాయి వ్యవసాయ ల్యాబ్ ప్రారంభించడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. ఇక్కడే మట్టి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంటుంది. జిల్లా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులోకి వస్తాయి. నకిలీ విత్తనాలు, పురుగుమందులకు చెక్ పడుతుంది.

– శిమ్మ ధర్మరాజు, మాజీ సర్పంచ్, గొంటి

శ్రీకూర్మంలో విష్ణు సహస్రనామ పారాయణం

గార : మండలంలోని శ్రీకూర్మం దేవాలయం వీధిలో జరుగుతున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం మహిళలు విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఇక్కడ సీతారామచంద్రుల కల్యాణోత్సవం వరకు ప్రతిరోజూ సాయంత్రం దేవతా సహస్ర నామపారాయణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం జరిగిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధార్మిక కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

గార: మండలంలోని దేవాలయాలు, చర్చిలు, దర్గాలు వద్ద సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేయాలని ఎస్సై ఆర్.జనార్దన్ నిర్వాహకులకు సూచించారు. గార పోలీస్‌స్టేషన్ వద్ద పలు సంఘాల ప్రతినిధులతో సోమవారం సమావేశమయ్యారు. ఇటీవల జరిగిన కొన్ని ఉదాంతాల నేపథ్యంలో అన్ని ధార్మిక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని హితవుపలికారు. నష్టం జరగకుముందే మేల్కోవడం మంచిదన్నారు. ప్రజలందరూ సహృద్భావ వాతావరణంలో మెలగాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.